*పచ్చదనం పెంపును అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలి*

*మంచి వర్షాలను సద్వినియోగం చేసుకుని హరితహారం విజయవంతం చేయాలి*

*హరితహారంలో పాల్గొంటున్న ప్రభుత్వ శాఖలన్నీ జవాబుదారీతనంతో పనిచేయాలి*

*అర్బన్ ఫారెస్ట్ పార్కులు ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకం, తక్షణం పనులు ప్రారంభం*

సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో చీఫ్ సెక్రటరీ ఎస్.కే.జోషి

సంక్షేమంతో పాటు, సామాజిక బాధ్యతగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టుతున్న పథకాలను ప్రభుత్వ యంత్రాంగం విజయవంతం చేయాలని చీఫ్ సెక్రటరీ ఎస్.కే. జోషి పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతీ ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా నాలుగో విడత తెలంగాణకు హరితహారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మంచి వర్షాలు పడుతున్నాయని వీటిని సద్వినియోగం చేసుకుంటూ విస్తృతంగా మొక్కలు నాటాలని, రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు మధ్య అంతరాయం (డ్రై స్పెల్ ) వస్తే తగిన విధంగా నీటి సౌకర్యం కల్పించేందుకు ఉపాధిహామీ నిధులను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు నిరంతరం హరితహారం ఫలితాలను పర్యవేక్షిస్తున్నారని, శాఖల వారీగా నాటిన మొక్కలు, తీసుకున్న చర్యలను రోజు వారీగా అటవీ శాఖ అభివృద్ధి చేసిన వెబ్ సెట్ లో (www.tgfmis.com)అప్ లోడ్ చేయాలన్నారు. మొక్కలు నాటుతున్న ప్రాంతం, ఎంత ఏరియాలో నాటుతున్న వివరాలు జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్కులు, తాజా పరిస్థితిపై జిల్లాల వారీగా కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. అటవీ ప్రాంతాల్లో సుమారు ఐదు వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న ఈ పార్కుల పట్టణ ప్రాంత ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయని, కలెక్టర్లు వీటి అభివృద్ధిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. అనుమతులను వేగవంతం చేసి అన్ని ప్రాంతాల్లో తక్షణం అర్బన్ ఫారెస్ట్ పార్కుల పనులు ప్రారంభించాలని, సంబంధిత శాఖలు కూడా పూర్తి సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. వీలున్నంత తొందరగా ప్రజలకు ఈ పార్కులను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో పనిచేయాలన్నారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయం, జవాబుదారీతనంతో పనిచేసినప్పుడే తెలంగాణకు హరితహారం విజయవంతం అవుతుందని చీఫ్ సెక్రటరీ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, పీసీసీఎఫ్ లు పి.కె.ఝా, రఘువీర్, ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్, అదనపు అటవీ సంరక్షణ అధికారులు డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.